
ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
ఆదివారం | జులై 05, 2026 | సంపుటి : 7 | సంచిక : 33 | పేజీలు : 2

## తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- వ్యవసాయం, తాగు, సాగునీరు, ఆరోగ్యం, విద్య, వాతావరణ పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్



2 లో

## కేసీఆర్‌కు వెయ్యెకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది?





- రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు
- ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క మహా వృక్షమైంది
- సీఎం రేవంత్‌రెడ్డి

**మిడ్జిల్, ఆయుధం:** ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణంలో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

"మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకున్నారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాలు 2006 లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన (మిగతా 2 లో..)



## రంకెలు వేసినంత మాత్రాన.. అంకెలు మారవు: హరీశ్‌రావు

**హైదరాబాద్, ఆయుధం:** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోంది" అని విమర్శించారు.



## దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి

**కాజీపేట, ఆయుధం:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో విసునూరు దేశముఖ్ దోపిడీ దౌర్జన్యాలు అఘాయిత్యాలకు వ్యతిరేకంగా నైజాం నవాబు దుర్మార్గాలకు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం ద్వారా మట్టిప్రజల్ని చైతన్యపరిచి సాయుధ పోరుకు సైరన్ ఊదిన సమయంలో 1946 జూలై 4న విసునూరు దొర గుండాలు కడవెండి గ్రామం పై కాల్పులు జరిపిన దానిలో 18 సంవత్సరాల యువకుడు దొడ్డి కొమరయ్య వీరమరణం పొందడం జరిగిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి తెలిపారు. శనివారం మడికొండ చౌరస్తాలో కాజీపేట మండల సిపిఐ కార్యదర్శి మాలోతు శంకర్ అధ్యక్షతన దొడ్డి కొమురయ్య 80 వ వర్ధంతి సభ నిర్వహించడం జరిగింది.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఆలయ పవిత్రతను దెబ్బతీశారు

- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్ర ఆగ్రహం
- భద్రకాళీ దేవస్థానం వద్ద రాజకీయాలు చేయడం తగదు
- ఆలయాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసిన బీజేపీ శ్రేణులు
- ప్రభుత్వ భూములు అమ్ముకుని, ఆలయాల్లో తడిబట్టలతో డ్రామాలాడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల తీరు సిగ్గుచేటు
- మంత్రి ఇలాకాలోనే దేవాలయాలు అపవిత్రం అవడం బాధాకరం
- పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వల్ల వరంగల్‌కు ఒరిగింది ఏమీ లేదు
- ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ అక్రమ సంపాదన కూడబెట్టుకుంటున్నారు

**(వరంగల్, ఆయుధం)**

భారతదేశంలోనే చరిత్ర ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం, ఓరుగల్లు నగర ప్రజల ఆరాధ్య దైవం భద్రకాళి అమ్మవారి దేవాలయాన్ని రాజకీయ స్వార్థం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వాడుకోవడం అత్యంత హేయమైన చర్య అని వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవి కుమార్ అన్నారు. తమ రాజకీయ ఉనికి కోసం, ఆరోపణల నుంచి తప్పించుకోవడం కోసం ఆలయ నియమాలను తుంగలో తొక్కి, భక్తులకు తీవ్ర ఇబ్బంది కలిగించిన





కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల వైఖరిని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్ తీవ్రంగా ఖండించారు. ''మాజీ 'కుడా' చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, ప్రస్తుత 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ రెడ్డి ఇద్దరూ కలిసి తడిబట్టలతో అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి ప్రమాణాలు చేయడం శాస్త్ర విరుద్ధం. వీరి స్వార్థ రాజకీయం వల్ల అమ్మవారి ఆలయం మైలపడింది. రాజకీయ నాయకుల అపవిత్ర చర్యల వల్ల, హంగామా వల్ల మైలపడిన భద్రకాళి ఆలయ పరిసరాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పసుపు నీళ్లతో, గంగా, గోదావరి శుద్ధ జలాలతో కడిగి పవిత్రం చేశాం. అమ్మవారి ఆలయ గౌరవాన్ని, సనాతన సంప్రదాయాలను కాపాడటం కోసమే ఈ శుద్ధి కార్యక్రమం చేపట్టామని స్పష్టం చేశారు. నిత్యం వేలాది మంది భక్తులు దర్శనం చేసుకునే పవిత్ర (మిగతా 2 లో..)



## పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

- వర్షా కాల సన్నద్ధతపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న క్షేత్రస్థాయి తనిఖీలు

వరంగల్, ఆయుధం: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నాలాలు, చెరువులు, పారిశుధ్య నిర్వహణ పనులను వేగవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ హనుమకొండలోని ఎస్ బీ హెచ్ కాలనీ, వడ్డేపల్లి చెరువు, సమ్మయ్యనగర్, బృందావన్ కాలనీ, పద్మాక్షి ఆలయ పరిసరాలు, అదేవిధంగా వరంగల్‌లోని బొందివాగు, అంబేద్కర్ నగర్, కరీమాబాద్, చిన్న వడ్డేపల్లి చెరువు, ఆటోనగర్ ప్రాంతాల్లో పర్యటించి నాలాలు, పారిశుధ్య నిర్వహణ, ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా నాలాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, పూడిక, చెత్త తొలగింపు పనులను వేగవంతం చేయాలని, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్ కుమార్, సీఎంహెచ్ఓ డా. రాజా రెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ సక్సెస్ చేయాలి

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

- వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 24, 37, 41 డివిజన్లో ఆకస్మిక తనిఖీ

2 లో



## మీసేవలో మరో కొత్త సర్వీస్

- ఎస్ఎస్‌సీ ఈ మెమో ప్రింట్

సౌకర్యం: ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్

2 లో



## దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, సామాజిక దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి ఆర్. సంపూర్ణ, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ చైర్మన్ అస్నాల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, బీసీ సంఘం నాయకులు శ్యామ్ యాదవ్, మండల నరసింహారాములు, బోనగిరి రాములు, ప్రకాష్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



2 లో

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పలీత శ్రీహరి, వక్తలు
- ఘనంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం

## మనం ఆరోగ్యంగా ఉండాలంటే దినచర్యలో మార్పు అవసరం

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐ.పి.ఎస్

**హనుమకొండ, ఆయుధం:** సమాజం బాగుండాలంటే మనం బాగుండాలి, మనం బాగుండాలంటే దిన చర్యలో మార్పు అవసరమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేత తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ గ్రౌండ్‌లో నిర్వహించిన వారాంతపు పరేడ్‌ను పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేత, ఐపీఎస్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశిస్తూ సీపీ మాట్లాడుతూ, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణ, నిబద్ధత, శారీరక దృఢత్వంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి వ్యాయామం, యోగాను అలవాటు చేసుకోవాలని తెలిపారు. "పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మరింత సమర్థవంతమైన సేవలు అందించగలుగుతారు" అని పేర్కొన్నారు. అంతేకాకుండా, క్రమశిక్షణే పోలీసు వ్యవస్థకు పునాది అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ విధుల్లో ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని కమిషనర్ ఎస్. శ్వేత సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీ లు అంతయ్య, సత్యనారాయణ, ఆర్.ఐ లు స్పర్జన్ రాజ్, సతీష్, శ్రీధర్, చంద్రశేఖర్, ఉదయ్ భాస్కర్, ఇన్స్పెక్టర్లు వెంకన్న, సువర్ణ, సుజాత, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బాలసముద్రం పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు పంపిణీ చేస్తున్న ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఎన్యూమరేషన్ ఫారాలు అందించారా, వాటిని పూరించి తిరిగి బీఎల్‌వోలకు సమర్పించారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీఎల్‌వోలతో మాట్లాడిన డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ఫారాల పంపిణీ పురోగతిని సమీక్షించారు. ఓటర్లు తిరిగి అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వో యాప్‌లో నమోదు చేసే విధానంపై స్థానిక బీఎల్‌వో స్వర్ణలతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో చేపడుతున్న కార్యక్రమాలు, నమోదు విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.



## ఓటర్ల జాబితా సవరణ సక్సెస్ చేయాలి

■ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

**హనుమకొండ, ఆయుధం:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి తెలిపారు. ఈరోజు వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 24, 37, 41 డివిజన్లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొండా మురళి మాట్లాడుతూ ఓటర్ల వివరాలసేకరణలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటికి వెళ్లి గణన నిర్వహించాలని, శాశ్వతంగా నివాసం మారినవారు, మరణించినవారు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం ధృవీకరించి చర్యలు చేపట్టాలని కొండా మురళి సూచించారు. బూత్ స్థాయి అధికారు (బీఎల్ఓ )లు చేపడుతున్న ఇంటింటి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్న కొండా మురళి.. గణన పత్రాలను స్వయంగా ఓటర్లకు అందజేసి పూర్తి సమాచారం నమోదు చేయాలని ఆదేశించారు. శాశ్వతంగా నివాసం మారినవారు, మరణించినవారు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను బీఎల్ ఓ యాప్ ద్వారా పరిశీలించి నిబంధనల మేరకు తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అలాగే ఓటర్లు తమ వివరాలను ఆన్లైన్లో కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందని, ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రజలకు కొండా మురళి తెలిపారు. అలాగే వరంగల్ తూర్పుకోట లోని ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని హౌసింగ్ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ పోశాల పద్మ స్వామి, కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

■ పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పలీత శ్రీహరి

**నడికూడ, ఆయుధం:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పి ఆర్ టి యు హనుమకొండ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పలీత శ్రీహరి అన్నారు. పిఆర్ టి యు టి ఎస్ 2026 సభ్యత్వ నమోదు కార్యక్రమం నడికుడ మండలంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంఠాత్మకూర్ లో నిర్వహించారు. పలీత శ్రీహరి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పిఆర్సి, డిఏ బకాయిలు, హెల్త్ కార్డ్స్ కు సంబంధించిన పూర్తి సమాచారము, సిపిఎస్ రద్దు, ప్రమోషన్స్, ట్రాన్స్ఫర్, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు సంబంధించిన టెట్ పై వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు ఉన్న సమస్యలను అతి త్వరలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, పిఆర్టియు రాష్ట్ర శాఖ అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ ప్రభుత్వంచే మాట్లాడి తీర్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల కౌకొండ, నడికూడ రాయపర్తి, వరికోల్, పులిగిల్ల చర్లపల్లిల లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల శాఖ అధ్యక్షులు అచ్చ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కటుకోజ్వల సతీష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మోడెమ్ రాజేందర్ బాబు, జిల్లా బాధ్యులు చింతల విశ్వేశ్వర్ లు పాల్గొన్నారు.

## మీసేవలో మరో కొత్త సర్వీస్

■ ఎస్ఎస్సీ ఈ మెమో ప్రింట్ సౌకర్యం: ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్

**ములుగు, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగంగా పౌరులకు మరొక ముఖ్యమైన సేవను మీ సేవ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎస్ఎస్సీ మార్క్స్ మెమోను కోల్పోయిన లేదా పోగొట్టుకున్న విద్యార్థులు ఇకపై తమ SSC eMemo ను మీసేవ కేంద్రాల ద్వారా సులభంగా పొందవచ్చని ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ సామాజి దేవేందర్ తెలిపారు. ESD మీసేవ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు 2004 సంవత్సరం నుండి పూర్తయిన ఎస్ఎస్సీ పరీక్షల eMemo లను మీ సేవ ద్వారా ప్రింట్ తీసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించినట్లు ఆయన వివరించారు. దరఖాస్తుదారులు తమ ఎస్ఎస్సీ హాల్ టికెట్ నంబర్, పరీక్ష పూర్తయిన సంవత్సరం వివరాలను అందజేస్తే, వెంటనే మీ సేవ స్టేషనరీపై అధికారిక SSC eMemo ప్రింట్ అందజేయబడుతుందని తెలిపారు. ఈ సేవకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.62/ సేవా రుసుము చెల్లించాల్సి ఉంటుందని, ఈ సౌకర్యం రాష్ట్రంలోని అన్ని మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ములుగు జిల్లా ప్రజలు ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ సామాజి దేవేందర్ కోరారు.

## ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలీకరణ

**ములుగు, ఆయుధం:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో కృష్ణవేణి సంబంధిత బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. శనివారం మల్లంపల్లి మండల కేంద్రం లోని, గౌస్పల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో కృష్ణవేణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలను బూత్ స్థాయి అధికారుల ద్వారా బీఎల్ఓ యాప్లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలీకరణను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి ఫారంలో నమోదు చేసే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితత్వంతో బీఎల్ఓ యాప్లో నమోదు చేయాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యాధికార సమరభేరిని జయప్రదం చేయండి

■ ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్



**హనుమకొండ, ఆయుధం:** వేల సంవత్సరాలుగా దేశానికి సేవ చేస్తున్న ఉత్పత్తి కులాల ప్రజలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఈ నెల 5 న యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన రాజ్యాధికార సమరభేరి సభలో ఎస్సీ, ఎస్టీ, బి.సి మైనార్టీ ప్రజలు జయప్రదం చేయాలని ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమరభేరి గోడ పత్రికలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జరుగు రాజ్యాధికార పోరులో విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, కర్షకులు, కవులు, కళాకారుల, ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, బి.సి. సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ పి వరంగల్ జిల్లా అధ్యక్షులు పెండెల సంపత్, న్యాయవాది జె జె. స్వామి, వివిధ ప్రజా సంఘాల నాయకులు చింతం లక్ష్మీనారాయణ, డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, సూరం నిరంజన్, తాటికొండ సద్గుణ, ముత్తోజు పద్మ, జల్లెల కృష్ణమూర్తి, లక్ష్మణ్ గౌడ్, బూరు రవి, ఎన్ ఎస్ రాజు, బీస మహేష్, ప్రకాష్, ఎల్లస్వామి యాదవ్, జన్ను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- చిన్న జిల్లాల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు
- ఆరు నెలల్లో రాష్ట్రంలో గణనీయమైన మార్పు తీసుకురావాలి
- రైతులకు తెలుగు భాషలో వ్యవసాయ సూచనలు పంపాలి
- యూరియా సకాలంలో అందించి దుర్వినియోగాన్ని అరికట్టాలి
- ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలి
- వ్యవసాయం, తాగు, సాగునీరు, ఆరోగ్యం, విద్య, వాతావరణ పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్




**హనుమకొండ, ఆయుధం:** రాష్ట్ర, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి జిల్లాకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటి సాధన దిశగా కార్యాచరణ చేపట్టి తెలంగాణ రాష్ట్రంను దేశంలోనే అగ్రగామిగా నిలపాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లకు సూచించారు. వ్యవసాయం, తాగునీరు, ఆరోగ్యం, సాగునీరు, విద్య, వాతావరణ పరిస్థితులపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐ.డీ.ఓ.సీ) నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, చిన్న జిల్లాలు ఉండడం వల్ల పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని, చిన్న సమస్యలు కూడా అధికారుల దృష్టికి వస్తాయని తెలిపారు. చిన్న జిల్లాల్లో ఐ.ఏ.ఎస్. అధికారులు అద్భుత ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రతి జిల్లా రాష్ట్ర, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా తనదైన అజెండాతో ముందుకు సాగాలని అన్నారు. సమష్టి కృషితో వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని తెలిపారు. జిల్లాల్లో ఎదురయ్యే ఏ సమస్యనైనా ఎప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

వర్షపాతం పరిస్థితులను సమీక్షిస్తూ కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఇప్పటివరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. రాష్ట్రంలో రెండు జిల్లాల్లో అధిక వర్షపాతం, 19 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 11 జిల్లాల్లో లోటు వర్షపాతం, ఒక జిల్లాలో అత్యల్ప వర్షపాతం నమోదైందన్నారు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందుతున్న నేపథ్యంలో రైతుల మొబైల్ నంబర్లు ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయని, ప్రతి రైతుకు తెలుగు భాషలో వ్యవసాయ సూచనలు, వర్షపాతం వివరాలు, వాతావరణ హెచ్చరికలు ఎస్.ఎం.ఎస్.ల ద్వారా నిరంతరం పంపించాలని ఆదేశించారు.

రైతులకు అవసరమైన యూరియా నిల్వలు రాష్ట్రంలో తగినంతగా ఉన్నాయని, ప్రతి రైతుకు అవసరమైన సమయంలో అవసరమైన పరిమాణంలో యూరియా అందేలా చూడాలని సూచించారు. యూరియా వృథా కాకుండా, అవసరానికి మించి వినియోగించకుండా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటలు, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం బోనస్ అందిస్తున్న ఏడు రకాల సన్న వరి వంగడాల పై రైతులకు స్పష్టమైన సమాచారం చేరేలా చూడాలని, ఆయా వంగడాల విత్తనాలు ప్రతి మండలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరి సాగు విస్తీర్ణాన్ని ప్రణాళికాబద్ధంగా తగ్గిస్తూ కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. పట్టణాలు, నగరాలకు సమీపంలోని రైతులు కూరగాయల సాగు చేపట్టేలా ప్రోత్సహించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లా స్థాయిలో పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలతో వెంటనే సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. యాంటీ లార్వా కార్యక్రమాలను చేపట్టాలని, ప్రతి శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. గురుకులాలు, హాస్టళ్లలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాల్లో ప్రతిరోజూ సీజనల్ వ్యాధుల నివేదికలను సమీక్షిస్తూ అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణుల జాబితాను ముందుగానే సిద్ధం చేయాలని, వారిని ఆరోగ్య సిబ్బంది నిరంతరం ఫాలో అప్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలిపారు. గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల నుంచి పట్టణాలు, నగరాలు, గ్రామాలకు బల్క్ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు సమన్వయంతో ప్రతి ఇంటికి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, పైప్ లైన్ లీకేజీ లను వెంటనే నివారించాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం మేరకు జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన *వీ.బీ.జీ.ఆర్. ఏఎం.జీ. (VBGRAMG)* పథకాన్ని అన్ని జిల్లాల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో చేపట్టే తాగునీటి పనులకు ఈ పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

విద్యాశాఖలో మధ్యాహ్న భోజన పథకం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఈ కార్యక్రమంపై మంత్రివర్గం సమగ్ర సమీక్ష నిర్వహించిందని, ప్రస్తుతం ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలలో భాగమయ్యారని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం, అల్పాహారం తీసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, దీంతో నాణ్యత నియంత్రణ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న, అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణరెడ్డి, డీఈవో గిరిరాజ్ గౌడ్, డిఐఈఓ గోపాల్, ఎస్డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ రవి, మున్సిపల్, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఆలయ పవిత్రతను దెబ్బతీశారు

(మొదటి పేజీ తరువాయి..)



క్షేత్రంలో, రెండు పార్టీలకు చెందిన ఈ ఇద్దరు నేతలు తమ అనుచరులతో వచ్చి హంగామా సృష్టించారు. దీనివల్ల సామాన్య భక్తులు గంటల తరబడి దర్శనాలు దొరకక, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అవినీతి ఆరోపణలు ఉంటే విచారణ సంస్థల ముందు లేదా ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలి. అంతేకాని, పవిత్రమైన దేవాలయాన్ని రాజకీయ పంచాయితీలకు వేదికగా మార్చడం సిగ్గుచేటు. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా తడిబట్టలతో గర్భాలయ పరిసరాల్లో ఇలాంటి చర్యలకు పాల్పడుతుంటే దేవస్థానం ఈవో, అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు? అధికార పక్ష ఒత్తిళ్లకు లొంగి ఆలయ పవిత్రతను కాపాడటంలో వారు విఫలమయ్యారు. ఆలయ పవిత్రతను భ్రష్టు పట్టించినందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు భక్తులకు, హిందూ సమాజానికి తక్షణమే క్షమాపణ చెప్పాలి. ఏ దేవాలయం వద్ద అయినా గేటు బయట రాజకీయాలు చేయాలి, గేటు లోపల అందులో వేలాదిమంది భక్తుల విశ్వాసాన్ని చొరగొనే గర్భగుడి వద్ద ఆలయ పరిసరాలలోపల రాజకీయాలు చేయడం తగదు. ఇలాంటి రాజకీయాలకు వేదికగా దేవస్థానాలను చేసుకోవడం సిగ్గుచేటు. తక్షణమే కాంగ్రెస్ బిఆర్ఎస్ నేతలు భద్రకాళి అమ్మవారి భక్తులకు క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాయాలి. వరంగల్ నగరంలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. పోలీసు వ్యవస్థకు ముందస్తు సమాచారం ఉన్న చూసి చూడనట్లు వ్యవహరించడం తగదు. పవిత్రమైన పుణ్యక్షేత్రం భద్రకాళి దేవస్థానం వద్ద రాజకీయ నాయకులు చేస్తున్న హంగామాను చూసి కనీసం పట్టించుకోకుండా వ్యవహరించిన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఉన్న ఇలాకాలోనే దేవాలయాలు అపవిత్రం అవడం బాధాకరం, సిగ్గుచేటు. అమ్మవారి భక్తులకు క్షమాపణలు చెప్పకపోతే, భద్రకాళి మాత భక్తుల ఆగ్రహానికి గురికాక తప్పదు.'' అని రవికుమార్ పేర్కొన్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నా. నేను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు. వందేళ్లుగా కులగణన జరగలేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచాం. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది. రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా? మూడెకరాల భూమి ఇచ్చారా? కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా ?ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఇసుక దోపిడీకి అడ్డు వచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పదేళ్లు తన కుటుంబానికి, బంధువులకు తప్ప.. ఎవరికైనా ఉద్యోగాలు, పదవులు వచ్చాయా? కేసీఆర్ కుటుంబం దోపిడీలు, దొంగతనాలు మళ్లీ మొదలు కావడానికి ప్రజాపాలన పోవాలా? కేసీఆర్కు గజ్వేల్లో వెయ్యి ఎకరాల ఫామ్హౌస్ ఎలా వచ్చింది? కేటీఆర్, కవిత, హరీశ్రావుకు రూ.వేల కోట్ల విలువైన భూములు, ఫామ్హౌస్లు ఎక్కడి నుంచి వచ్చాయి?'' అని రేవంత్రెడ్డి ప్రశ్నించారు.

### టీబీ, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్

## శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

■ ముందస్తు వ్యాధి నిర్ధారణతో ప్రాణాలను కాపాడుకోవచ్చు

■ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**హనుమకొండ, ఆయుధం:** ఆరోగ్యపరంగా అధిక ప్రమాదం (హైరిస్క్) ఉన్న వర్గాల కోసం వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న క్షయవ్యాధి (టీబీ), అసంక్రమిత వ్యాధుల (NCD) స్క్రీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపునిచ్చారు. శనివారం హసన్పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భీమారం పాత గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన టీబీ, ఎన్సీడీ స్క్రీనింగ్ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్ రావు శిబిరం నిర్వహణ, అందిస్తున్న సేవలపై కలెక్టర్కు వివరించారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ, మొబైల్ ఎక్స్రే సేవలు, నిక్షయ్ పోర్టల్, ఎన్సీడీ ఆన్లైన్ పోర్టల్ ద్వారా నమోదు ప్రక్రియను పరిశీలించారు. టీబీ చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు పోషకాహార కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యం దేశంలో క్షయవ్యాధి నిర్మూలనేనని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం అత్యాధునిక, ఖరీదైన చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తోందని చెప్పారు.

టీబీ రోగులకు చికిత్స కాలంలో నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా ప్రతి నెల రూ.1,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. క్షయవ్యాధిపై ఎలాంటి అపోహలకు లోనుకాకుండా రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్, ఇన్చార్జి డీఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, హసన్పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ భరత్, డాక్టర్ మానస, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, టీబీ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఏలకు దిశానిర్దేశం చేసిన డాక్టర్ శ్రీగోదా రెడ్డి

**హనుమకొండ, ఆయుధం:** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు వారి కుమార్తె డాక్టర్ శ్రీగోదా విష్ణు రెడ్డి శుక్రవారం రెండు విడతలుగా బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. మొదటి సమావేశం హనుమకొండ డీసీసీ భవన్లో నిర్వహించగా, 47, 60, 61, 62, 63 డివిజన్ల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), డివిజన్ ఇన్చార్జీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం విశాల్ భవన్లో జరిగిన సమావేశంలో 51, 59 డివిజన్ల బీఎల్ఏలు, పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ ఫారాలను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయడం, ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం, అవసరమైన సవరణలు చేయడం, ప్రతి అర్హత కలిగిన ఓటరికి పూర్తి సహకారం అందించడంపై డాక్టర్ శ్రీగోదా విష్ణు రెడ్డి సవివరంగా మార్గనిర్దేశం చేశారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రతి ఓటరు హక్కు పరిరక్షణకు బీఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత డివిజన్ ఇన్చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెష్ డోర్స్ సొల్యూషన్స్ ప్రారంభం

**వరంగల్, ఆయుధం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చింతలపూడి నియోజకవర్గ సొంగా రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా, తన చిన్ననాటి స్నేహితులు మాటూరి ప్రవీణ్ కుమార్, బి.అంబర్ కుమార్ లు సంయుక్తంగా కలిసి తెలంగాణ రాష్ట్రం వరంగల్లో 7వ బ్రాంచ్గా ఏర్పాటు చేసిన "HIVARA MESH DOORS SOLUTIONS LLP"ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి స్కూల్ మేట్స్తో కలిసి ఎంతో ఆప్యాయంగా, ఉత్సాహభరితంగా గడిపారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ స్నేహితులతో ఆనంద క్షణాలను పంచుకున్నారు. నూతనంగా ప్రారంభమైన HIVARA MESH DOORS SOLUTIONS LLP సంస్థ మరింత అభివృద్ధి చెందుతూ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, తన స్నేహితుని వ్యాపారం మరింత గా అభివృద్ధి చెందాలని కాంక్షిస్తూ వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చి సంస్థ యాజమాన్యానికి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695